

హామీలు అమలు చేశాం

ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేశామని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



అకాల వర్షం.. అపార నష్టం

అకాల వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని ఆరుగాలం శ్రమించిన రైతన్నలు కలవర పడుతున్నారు. 8లో▸



దూషిస్తే ఊరుకోం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను దూషిస్తే ఊరుకోమని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్ అన్నారు. 8లో▸

సాక్షి రంగారెడ్డి

సోమవారం ၊ 9 ၊ డిసెంబర్ ၊ 2024

న్యూస్‌రీల్

టీఎస్‌ఆర్‌ఏ అధ్యక్షుడిగా రవి నాయక్



రవినాయక్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తుక్కుగూడ: స్క్వాష్ రాకెట్ అసోసియేషన్ (టీఎస్‌ఆర్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన 10వ వార్డు కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ.. తన ఎన్నిక కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల, కళాశాల స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు.

14న ‘పట్నం’ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ పదవీ ప్రమాణస్వీకారోత్సవాన్ని ఈనెల 14న ఉదయం పదిన్నర గంటలకు స్థానిక మార్కెట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు కొత్తగా నియమితులైన కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

13, 14 తేదీల్లో యూటీఎఫ్ జిల్లా మహాసభలు



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప కోరారు. ఈ మేరకు మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి రోజు నిర్వహించే సభలో పూర్వ ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక, మాధ్యమిక, సెకండరీ విద్య ఎలా ఉండాలి, ఉన్నత విద్య ఏ విధంగా ఉండాలనే నిర్దిష్ట విధానాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. చర్చల సారాంశాన్ని విధాన పత్రం రూపంలో ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందన్నారు. రెండో రోజు సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి జగన్నాథ్‌శర్మ, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన క్యాదర్శి వెంకటయ్య, కోశాధికారి నర్సింలు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సిటీకి దీటుగా అభివృద్ధి

అదే నా ముందున్న లక్ష్యం

‘ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా.. కిందిస్థాయి నుంచి ఎమ్మెల్యే వరకు ఎన్నో చూశా.. ప్రజల సమస్యలు, కష్టాలు తెలిసిన వ్యక్తిగా నిత్యం వారి మధ్యే ఉంటూ.. వారి కోసమే పని చేస్తున్నా. ప్రజల ఆశీర్వాదంతోనే మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. వారి రుణం తీర్చుకునేలా పని చేస్తున్నా. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ.. ప్రజాపాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు చేరేందుకు కృషి చేస్తున్నా’ అంటున్నారు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య. ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ఇప్పటివరకు చేసింది.. నాలుగేళ్లలో చేయాల్సింది ‘సాక్షి’తో పంచుకున్నారు.

– చేవెళ్ల



- హామీలన్నీ నెరవేర్చి తీరుతా
- ప్రజాసేవకే జీవితం అంకితం
- నాలుగేళ్లలో చేయాల్సింది ఇంకా చాలా ఉంది
- ‘సాక్షి’తో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రశ్న: నియోజకవర్గ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు?

జవాబు: హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అబివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాను. వచ్చే నాలుగేళ్లలో నగరానికి దీటుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం. దీనికి అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నాను. ఇప్పటికే మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాలు నగరంతో సమానంగా దూసుకెళ్తున్నాయి. షాబాద్ అంతర్జాతీయస్థాయి పరిశ్రమలతో పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. చేవెళ్ల, నవాబుపేట మండలాలు డెవలప్ కావాల్సి ఉంది.

ప్రశ్న: గ్రామీణ రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో అన్ని గ్రామాలకు కొత్త బీటీరోడ్లు వేశాం. ప్రస్తుతం గ్రామీణ రోడ్ల మరమ్మతుల కోసం గత ప్రభుత్వంలోనే నిధులకోసం కృషి చేశాను. పెండింగ్‌లో ఉండిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే అన్ని రోడ్లు మారిపోతాయి. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున బ్రిడ్జిల నిర్మాణం, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు తదితర ఎన్నో పనులు చేపట్టాను.

ప్రశ్న: ఏడాదిలో ఏం చేశారు.. మరో నాలుగేళ్లలో ఏం చేయాలనుకుంటున్నారు ?

జవాబు: ఏడాదికాలంలో నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి రూ.10 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు, రూ.3 కోట్ల డీఎంఎఫ్‌టీ, రూ.6 కోట్ల ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం. రూ.24 కోట్లతో ముడిమ్యాల నుంచి ప్రొద్దటూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు మంజూరు తదితర పనులు జరుగుతున్నాయి. ఇంటిగ్రేటేడ్ పాఠశాలను నవాబుపేటలో మంజూరు చేయించాం. చేవెళ్లకు సబ్‌కోర్టు, ఏడీజే కోర్టులు తీసుకురావడం జరిగింది. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి. వచ్చే నాలుగేళ్లలో పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి నియోజకవర్గాన్ని ప్రగతిపథంలోకి తీసుకెళ్లేందుకు పాటుపడుతాను.

ప్రశ్న: శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి ఎలా ఉంది.. చేవెళ్ల మున్సిపాలిటీ ఏర్పాటు అంశం ఎంతవరకు వచ్చింది?

జవాబు: శంకర్‌పల్లి మున్సిపాలిటీలో ప్రస్తుతం రూ.30 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆదర్శ మున్సిపాలిటీగా చేసేందుకు కృషి చేస్తాన్నాను. చేవెళ్ల మున్సిపాలిటీ అంశం శాఖా పరంగా ప్రకటిస్తారు.

ప్రశ్న: చేవెళ్లలో వంద పడకల ఆస్పత్రి హామీ పెండింగ్‌లోనే ఉంది కదా?

జవాబు: ఇచ్చిన హామీ ప్రకారం వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయించడం జరిగింది. రూ.17కోట్లు నిధులు సైతం మంజూరయ్యాయి. స్థలం కేటాయింపు అంశం పనులు జరుగుతున్నాయి. త్వరలోనే శంకుస్థాపన చేస్తాం.

ప్రశ్న: జీఓ 111 అంశంపై స్పష్టత లేదు. దీనిపై ఏం చెబుతారు?

జవాబు: ప్రస్తుతానికి జీఓ 111 నిశ్శబ్దంగానే ఉంది. గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయం వరకు ఆగింది. సీఎంతో మాట్లాడిన తరువాత ఈ అంశంపై మాట్లాడతాను.

ప్రశ్న: డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గానికి ఎన్ని వచ్చాయి.. ఎన్ని ఇస్తున్నారు?

జవాబు: నియోజకవర్గానికి 3,500 నుంచి 4000 ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందిరకమ్మ కమిటీలు వేయడం పూర్తయింది. దీనికి సంబంధించి యాప్‌ను సీఎం ఇటీవలే విడుదల చేశారు. గ్రామాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన పేదలకు తప్పకుండా అందిస్తాం.

ప్రశ్న: యువత ఉపాధి అవకాశాల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.. ఆలూరులో పారిశ్రామికవాడ ఏర్పాటవుతుందా?

జవాబు: షాబాద్ మండలంలోని హైతాబాద్, చందనవెల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో అంతర్జాతీయ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ఆలూరులో పారిశ్రామికవాడ ఏర్పాటు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

ప్రశ్న: చేవెళ్లలో ఆర్టీసీ బస్ డిపో కోసం స్థలం కేటాయింపుతో ఆగింది.. ఎప్పుడు పూర్తవుతుంది?

జవాబు: చేవెళ్లలో ఆర్టీసీ డిపో నిర్మాణంకోసం స్థలసేకరణ జరిగింది వాస్తవమే. డిపో ఏర్పాటు అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాను. చేవెళ్ల బస్‌స్టేషన్ విస్తరణ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ప్రారంభం అవుతుంది.



రాచులూరులో సమావేశమైన రైతులు

‘ఫ్యూచర్’ రోడ్డుకు భూములిచ్చేది లేదు

స్పష్టం చేసిన భూ బాధితులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులు ఆదివారం మండల పరిధిలోని రాచులూరులో సమావేశమయ్యారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న కొంగర, తిమ్మాపూర్, అగర్‌మియాగూడ, లేమూరు, రాచులూరు, బేగంపేట, తుర్కగూడ తదితర గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యారు. తమ భూములు రోడ్డుకు ఇచ్చేదిలేదని తేల్చిచెప్పారు. ప్రస్తుతం ఉన్న శ్రీశైలం రహదారితో పాటు ఎలిమినేడు నుంచి తిమ్మాపూర్ మీదుగా ఒక రోడ్డు, గతంలో ఫార్మాసిటీ కోసం నిర్మించిన మరో రహదారి అందుబాటులో ఉండగా మళ్లీ కొత్తగా రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. పంటలు పండే భూములను తీసుకుని రోడ్డు నిర్మిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేకంగా పోలీసు బలగాలతో పట్టా భూముల్లో సర్వే చేయడంతో పాటు మట్టి పరీక్షల కోసం డ్రిల్లింగ్ పనులు చేయడం ఏమిటని నిలదీశారు. దీన్ని వ్యతిరేకిస్తున్న తమపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారని, ఎటి పరిస్థితుల్లోనూ తమ భూములు ఇచ్చేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు డి.సుధాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్‌చారి, జంగయ్య, యాదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్లు మెరిసేలా..

సాక్షి, సిటీబ్యూరో: ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఘనంగా నిర్వహిస్తోంది. తెలంగాణ తల్లి విగ్రహ నమూనా చిత్రాన్ని రద్దీ ఎక్కువగా ఉండే మెట్రో స్టేషన్లలో ప్రదర్శిస్తున్నారు. ‘జయ జయహే తెలంగాణ.. జననీ జయ కేతనం’ అంటూ తెలంగాణ స్ఫూర్తిని అంది పుచ్చుకుంటూ హైదరాబాద్‌లోని మొత్తం 25 మెట్రో స్టేషన్లలో కొత్తగా రూపొందించిన ‘తెలంగాణ తల్లి’ చిత్రాలను ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో స్టేషన్ల పరిధిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందమైన విద్యుద్దీపాల అలంకరణతో ప్రధానం మెట్రో మార్గాలు నగరవాసులను విశేషంగా అలరిస్తున్నాయి.



ఢీ అంటే ఢీ!

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- లగచర్ల ఘటన, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూ సేకరణ..
- హైడ్రా కూల్చివేతలు, బీజాపూర్ రోడ్డు విస్తరణ..
- రుణమాఫీ అంశాలను ప్రస్తావించనున్న బీఆర్‌ఎస్
- విమర్శలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా అధికార పార్టీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జిల్లాలో రాజకీయ వేడిని పుట్టించనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాలోని ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏవిధంగా స్పందిస్తారనే దానిపై ఉమ్మడి జిల్లాలో వాడీవేడి చర్చ సాగుతోంది. తమ సమస్యలను శాసనసభ, మండలిలో సభ్యులు ప్రస్తావిస్తారా.. లేదా మౌనం వహిస్తారా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు స్థానికంగా వివాదాస్పదమైన ఫార్మాసిటీ కోసం లగచర్లలో చేపట్టిన భూసేకరణ అంశం, ఫోర్త్‌సిటీ విస్తరణ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం చేపట్టిన భూసేకరణ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, హైడ్రా దూకుడు, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్ల కూల్చివేత, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, శివారులో ఐటీ విస్తరణ, కొత్త పరిశ్రమలు, ధరణి సమస్యలను ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ లేవనెత్తే అవకాశం ఉంది. ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టేందుకు అధికారపార్టీ ఎమ్మెల్యేలు కూడా వ్యూహాత్మకంగా ఎత్తుకు పైఎత్తులతో సిద్ధమవుతున్నారు.

అస్త్రశస్త్రాలు సిద్ధం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 17 మంది శాసనసభ్యులు, ఐదుగురు శాసన మండలి సభ్యులు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ సహా మహేశ్వరం, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. వీరిలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కొడంగల్ సహా వికారాబాద్, పరిగి, తాండూరు, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు శాసనసభ, శాసన మండలి వేదికగా తమ గళాన్ని విప్పేందుకు సిద్ధం అవుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నిలదీయనుండగా, వారి విమర్శలను అదేస్థాయిలో తిప్పికొట్టేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు వ్యూహాలు రచిస్తున్నారు.

ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలివే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మాకంపెనీల ఏర్పాటుకు దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల్లో 1,375 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఇటీవల కలెక్టర్ సహా ఇతర అధికారులు లగచర్లకు వెళ్లడం.. భూ బాధితులు అధికారులపై తిరగబడటం.. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడం విధితమే. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా అనేక మంది రైతులను అరెస్టు చేసి, జైల్లో పెట్టడాన్ని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ప్రధానంగా ప్రస్తావించనుంది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా 30 వేల ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఫోర్త్‌సిటీ, 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం రైతుల నుంచి బలవంతపు భూ సేకరణ అంశం సహా మూసీ ప్రక్షాళన పేరుతో రాజేంద్రనగర్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో పేదల ఇళ్ల కూల్చివేత అంశాన్ని బీఆర్‌ఎస్ సహా బీజేపీ ఎమ్మెల్యేలు ప్రధానంగా లేవనెత్తనున్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు బీజాపూర్ రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం, ఇటీవల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ప్రాణ, ఆస్తి నష్టాల అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం లేకపోలేదు. మున్సిపాలిటీల్లో శివారు గ్రామాల విలీనం అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

కాంగ్రెస్ పార్టీ అస్త్రాలివే..


ముచ్చర్ల ఫార్మాసిటీ కోసం బీఆర్‌ఎస్ హయాంలో అడ్డగోలుగా చేపట్టిన భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపులో చోటు చేసుకున్న అక్రమాలు, ధరణి సాంకేతిక పరిజ్ఞానంలో లోపాలు, జీఓ నంబర్ 58, 59 పేరుతో నాటి అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వైనాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా ప్రస్తావించనుంది. బీఆర్‌ఎస్ నేతల ఆక్రమణలు, అధికారిక నిర్మాణాలు, ఫాంహౌస్‌ల్లో విందులు, డ్రగ్ కేసుల వంటి అంశాలను తెరపైకి తీసుకొచ్చి ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఇరుకున పెట్టనుంది. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, రైతు రుణ మాఫీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే గృహాలకు ఉచిత విద్యుత్ పథకం, వరి ధాన్యం కొనుగోలు, బోనస్, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా ఫోర్త్‌సిటీ పేరుతో అత్యాధునిక నగరం ఏర్పాటు, స్కిల్ యూనివర్సిటీ, యువతకు నైపుణ్య కల్పన, ఏటీసీ, స్పోర్ట్స్ హబ్‌ల ఏర్పాటు వంటి అభివృద్ధి అంశాలను ప్రధానంగా ప్రస్తావించనుంది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యుల విమర్శలను తిప్పి కొట్టేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం అదే స్థాయిలో సిద్ధం అవుతున్నారు.




గగన విన్యాసం..

ఒకవైపు ఆకాశమే హద్దుగా వైమానిక దళాల విన్యాసాలు.. మరోవైపు హృదయోల్లాసంగా సాగిన సాంస్కృతిక ప్రదర్శనలు.. ఇంకోవైపు రాహుల్ సిప్లీగంజ్ గానామృతం.. వెరసి.. ఆదివారం సంధ్య వేళ హుస్సేన్ సాగర్ తీరం సొయగాల రాగాలను ఆలపించింది. మరోపక్క తెలంగాణ వంటకాలు, రుచులను పరిచయం చేస్తూ ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు, తినుబండారాలు, అలంకరణ వస్తువులతో కూడిన స్టాళ్లు.. ఇలా మొత్తం కలగలిపి సాగర తీరంలో జన జాతరను తలపించింది. ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆయా కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి.

– ఖైరతాబాద్







బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా

బాలబాలికల విభాగాల్లో జిల్లా ప్రథమస్థానం



అతిథులతో ప్రథమ బహుమతి అందుకున్న జిల్లా బాలికల జట్టు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ (అండర్ 17 విభాగం బాలబాలికల) పోటీలు ఆదివారం ముగిశాయి. బాలికల సెమీఫైనల్‌లో ఖమ్మంపై (15) రంగారెడ్డి (23)విజయం సాధించగా, నిజామాబాద్‌పై (22) హైదరాబాద్ (25) విజయం సాధించింది. ఫైనల్‌లో హైదరాబాద్‌పై(05) రంగారెడ్డి (19) విజయం సాధించి ప్రథనస్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయస్థానంలో హైదరాబాద్ నిలిచింది. బాలుర సెమీఫైనల్‌లో ఖమ్మంపై(21) రంగారెడ్డి (35) విజయం సాధించగా, నిజామాబాద్‌పై(21) హైదరాబాద్(23) విజయం సాధించింది. ఫైనల్‌లో హైదరాబాద్‌పై(08) రంగారెడ్డి (18) విజయం సాధించి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో హైదరాబాద్ నిలిచింది. మహబూబాబాద్ అడిషనల్ ఎస్పీ చెన్నయ్య విజేతలకు మెడల్స్, షీల్డ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ లక్ష్యం ఎంచుకుని ముందుకు సాగాలని, అప్పుడే వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలతోపాటు, చదువులో రాణిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు, డీవైఎస్ఓ జ్యోతి, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వరరావు, హెచ్ఎం రాజు, బండారు నరేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రావుల మురళి, పీడీలు కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేశాం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఇచ్చిన హామీలు అమలు చేశామని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినందుకు నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉమ్మడి ఘట్‌కేసర్, కీసర మండలాలకు చెందిన 407 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ఘట్‌కేసర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేశామని, ఏవైన పెండింగ్‌లో ఉంటే పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేస్తామని, తెలంగాణలో ప్రతి మండలంలో చెక్కులు అందజేస్తున్నామన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీల అమలులో ఆటంకాలు ఎదురైన వెనకడుగు వేసేది లేదని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్లు పావనీజంగయ్య, ప్రణీతగౌడ్, చైర్మన్లు కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, తహసీల్దార్లు రజని, హసీనా, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, జంగయ్యాయాదవ్, కౌన్సిలర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'వీర్లపల్లి'ని దూషిస్తే ఊరుకోం



సమావేశానికి హాజరైన బీసీసేన నాయకులు

బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణయాదవ్

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాలకు చెందిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను దూషిస్తే చూస్తూ ఊరుకోం అని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పోలీసులు, జర్నలిస్టులను కులాల వారీగా ప్రజలను ఇష్టానుసారంగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కుటుంబం పదేళ్ల పాలనలో ఎంత అరాచకం చేశారనే సందర్భంలో మాట్లాడిన మాటలను వక్రీకరించి ఎమ్మెల్యే శంకర్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కుల వృత్తులు మర్చిపోయి కంప్యూటర్లను పట్టుకునే రోజులు వచ్చినా గొర్లు, బర్లు, ఈత చెట్లు, ఇస్త్రీ పెట్టెలు కేసీఆర్ ఇచ్చి మా మనోభావాలు దెబ్బ తీయలేదా అని ప్రశ్నించారు. బీసీ నాయకుడు వీర్లపల్లి శంకర్‌కు అండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీసేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు నర్సింహ, నరేష్, మల్లేష్, కృష్ణ, లక్ష్మణ్, సత్యం, శేఖరప్ప, రాజేందర్, అశోక్‌గౌడ్, రాజు, లింగంయాదవ్, అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మొయినాబాద్: హిమాయత్‌సాగర్ చెరువులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం ఉదయం లేక్ పోలీసులు మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా హిమాయత్‌సాగర్ చెరువులో ఓ గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని గుర్తించారు. నీటిలో తేలుతూ శవం కనిపించడంతో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. వారం రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుని ఒంటిపై బ్లూ కలర్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రావిర్యాలచెరువులో..

ఇబ్రహీంపట్నం రూరల్: రావిర్యాల చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఆదిబట్ల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆదివారం చెరువులో గుర్తు తెలియని మృతదేహం తేలియాడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడి వయసు 20–25 సంవత్సరాలు ఉన్నట్లు భావిస్తున్నారు. నలుపు, తెలుపు రంగులో ఉన్న షార్టు, ముదురు ఆకుపచ్చ టీ షర్టు కలిగి ఉన్నాడన్నారు. చేయి మీద శ్రీ అనే అక్షరం పచ్చ బొట్టు ఉందని పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మరణించినట్లు, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం.. పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 215 వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

గృహిణి అదృశ్యం

రాజేంద్రనగర్: ఓ గృహిణి అదృశ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి ప్రాంతానికి చెందిన రుక్కన్న, పద్మ(35) దంపతులు. బతుకుతెరువు కోసం కిస్మత్‌పూర్ ప్రాంతానికి వచ్చి కూలీపని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 7న ఇరువురి నడుమ గొడవ జరిగింది. ఇంటి నుండి బయటికి వెళ్లిన పద్మ ఎంతకీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అకాల వర్షం.. అపార నష్టం

- దెబ్బతిన్న వరి, పత్తి పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు



ముట్పూర్‌లో నేలకొరిగిన వరి



తడిసి నల్లబడుతున్న పత్తి

కొందుర్గు: అకాల వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని ఆరుగాలం శ్రమించిన రైతన్నలు కలవర పడుతున్నారు. ఇన్ని రోజులు కష్టపడి పండించిన పంటలు కళ్లెదుటే పాడవుతున్నాయని లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాల్లో వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేస్తారు. ప్రస్తుతం పంట చేతికొచ్చి కోత దశలో ఉంది. కూలీల కొరతతో పత్తి తీయడం వీలుగాక పంట పొలాల్లో తెల్లగా వేలాడుతుంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి తడిసి ముద్దయిందని అన్నదాతలు వాపోతున్నారు. ఇలాగే వర్షం కురిస్తే పత్తి పొలంలోనే మొలకెత్తుతుందని అంటున్నారు. ఇక వరి పంట పూర్తిగా ఎండిపోయి నేలకొరిగిందని యంత్రాలు సమయానికి రాకపోవడంతో నూర్పిడి చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటంతా నేలపాలైందని వాపోయారు. కురిసిన వర్షాలకు పొలం మెత్తబడి వరి నూర్పిడి యంత్రాలు మరో వారం రోజుల పాటు పొలంలోకి రాలేని పరిస్థితి నెలకొందని రైతన్నలు మదన పడుపతున్నారు.

మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం

చేవెళ్ల: మండలంలో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు పండించి వరి ధాన్యాన్ని చేవెళ్ల మార్కెట్ యార్డు వద్ద ఉన్న ప్లాట్‌ఫాంలపై ఆరబెట్టారు. దాదాపు 15 మంది ఆరబెట్టిన ధాన్యం శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన అకాల వర్షానికి తడిసిపోయింది. దీంతో చేసేదేమి లేక రైతులు కవర్లు కప్పుతున్నారు. తడిసిన ధాన్యానికి ధర కూడా పలకదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో అందుబాటులో కొనుగోలు కేంద్రం లేకపోవటంతో షాబాద్‌లోని సర్దార్‌నగర్, శంకర్‌పల్లిలోని మోకిల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలకు వెళ్లాల్సి ఉంది.



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

రెండు రోజుల క్రితమే కోత



నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాను. రెండు రోజుల క్రితమే కోశాను. మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం ఆదివారం బస్తాల్లో నింపాలనుకున్నా. ఇంతలోనే అకాల వర్షానికి పూర్తిగా తడిసింది. సిమెంట్ బెడ్ కావటంతో వర్షం నీళ్లు ధాన్యం కింద నుంచి పోవటంతో పూర్తిగా తడిసింది. దీంతో మళ్లీ రెండు రోజులు ఆరబెడితే కానీ నింపలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి. తడిసిన ధాన్యం అని కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలి. – శేఖర్, రైతు, కుమ్మెర

నాలుగెకరాల్లో పత్తి వేశా



ప్రస్తుతం నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. గతేడాదితో పోలిస్తే ఈసారి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. కనీసం పంట పెట్టుబడి సైతం రాని దుస్థితి దాపురించింది. వర్షాలకు పొలంలోనే పత్తి తడిసిపోయి నల్లగా మారుతుంది.

– మల్లయ్య, రైతు, విశ్వనాథ్‌పూర్

తేమ ఉన్నా ధాన్యం కొనాలి



వరి పంటలు పూర్తిగా ఎండిపోయి కోతకొచ్చాయి. ఈ సమయంలో వర్షాలు రావడం బాధాకరం. గత పది రోజులుగా ఎండలు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలాల్లోనే తడిసి పోతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు సడలించి తేమశాతం ఎక్కువ ఉన్నా ధాన్యం కొనాలి.

– జంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి

మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు



జ్యోతిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

శంకర్‌పల్లి: మండల ంలోని చెందిప్ప గ్రామంలో వెలసిన మరకత శివాలయాన్ని ఆదివారం రంగారెడ్డి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతిరెడ్డి, రఘురాంరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం లింగానికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు దంపతులకు ఆలయ చరిత్ర, విశిష్టతను వివరించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరకత శివుడిని దర్శించుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సభ్యులు హనుమంతు, దర్శన్, శేఖర్‌రెడ్డి, పూజారి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



జన్మించిన శిశువును కుటుంబ సభ్యులకు అందిస్తున్న సిబ్బంది

కేశంపేట: అంబులెన్స్‌లో ఓ గర్భిణి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన శిరీష పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. వెంటనే అంబులెన్స్‌ను ఆపి కుటుంబ సభ్యుల సహకారంతో ఈఆర్‌సీపీ డాక్టర్ మనిష్, ఈఎంటీ సురేష్, పైలెట్ దీపక్‌లు ఆమెకు సుఖ ప్రసవం చేశారు. శిరీష పండటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఓటమి గెలుపునకు నాంది

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- ముగిసిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

భూపాలపల్లి: క్రీడల్లో ఓటమి గెలుపునకు నాంది పలుకుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర 9వ శీతాకాల ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ –2024 ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు, కప్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. భూపాలపల్లిలో రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించేందుకు అన్ని వసతులతో కూడిన 50 మీటర్ల స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్(ఐతు), స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమేశ్, జిల్లా కార్యదర్శి మధన్‌మోహన్, సభ్యులు పైడిపెల్లి రమేశ్, జల్ది రమేశ్, సింగరేణి క్రీడా సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్‌లు పాక శ్రీనివాస్, రాజమౌళి, రాజేశ్వర్‌రావు, తిరుపతి, అఖిల్, నరేశ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ జట్టుకు ఓవరాల్ చాంపియన్ షిప్

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో హైదరాబాద్ జట్టు అత్యధిక మెడల్స్ సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకోగా ద్వితీయ స్థానంలో రంగారెడ్డి నిలిచింది. గ్రూప్ –1 విభాగంలో డీ.వర్షిత్ 5 గోల్డ్ మెడల్స్, అదితి నాదెళ్ల ఐదు గోల్డ్ మెడల్స్, గ్రూప్ –2 విభాగంలో సచిన్ సాత్విక్ 4 గోల్డ్, ఒక సిల్వర్, జోహన్న సిజు– 4 గోల్డ్, ఒక సిల్వర్, గ్రూప్ –3 విభాగంలో అబ్దుల్ హమీద్ ఇషాన్ –5 గోల్డ్, అభినయ జాహ్నవి –4 గోల్డ్ మెడల్స్ సాధించారు. అత్యధిక పాయింట్లు సాధించినందుకు వీరికి కప్‌లను అందజేశారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

భార్య కాపురానికి రాలేదని పురుగుల మందు తాగి ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం





సెల్‌టవర్‌పై ఆటో డ్రైవర్ అంజి

తాండూరు టౌన్: భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదంటూ ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు నచ్చజెప్పి ఎట్టకేలకు అతన్ని కిందకు దింపారు. వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం దామర్‌చేడ్ గ్రామానికి చెందిన అంజి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మూడు రోజుల క్రితం లక్ష్మి పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రమ్మంటే రావడం లేదని మనస్తాపంతో పురుగు మందు తాగి, సెల్ టవర్ ఎక్కాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. స్థానికులు, పోలీసులు రెండు గంటల పాటు అతనికి నచ్చజెప్పారు. ఎట్టకేలకు సెల్ టవర్ నుంచి కిందికి దిగాడు. తన భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదనే ఆత్మహత్యాయత్నం చేశానని తెలిపాడు. వెంటనే పోలీసులు అతన్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. మద్యానికి బానిసై ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ భార్యతో తరచూ గొడవపడుతున్నాడని, అందుకే ఆమె పుట్టింటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అంజి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు చెప్పారు.



ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పద్మావతి ఆర్ట్ అకాడమీ, సూత్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువు కార్నతి కిరణ్ శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఇందులో మోదమున, వినాయకకౌతం, పుష్పాంజ లి, హిమగిరితనయే, కొలువై ఉన్నదే, జతిస్వరం, దశావతారం, పలుకే బంకారమాయెనా, థిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కళాకారులు వేదం, సహస్ర పాల్గొన్నారు.

